# సాక్షి కామారెడ్డి

సోమవారం । 13 । మార్చి । 2023






### అన్నదాత 'వరి'గోస

ఓవైపు వరి పైరును తెగుళ్లు ఆశిస్తుండడం, మరోవైపు బోరుబావులు ఎత్తిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



### 'బండి'పై ఫిర్యాదు

ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు నిరసనలు కొనసాగించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

36.1 /17.0

### వాతావరణం

ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### 20న యువ ఉగాది సంబురాలు

కామారెడ్డి అర్బన్: ఇండియన్ రెడ్‌క్రాస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో యువ ఉగాది సంబురాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్న, సమన్వయకర్త బాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి పది మంది యువతకు పాల్గొనే అవకాశం ఉందని, ఆసక్తిగల 18 నుంచి 35 ఏళ్లలోపు సంఘ సేవకులు రెడ్‌క్రాస్ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు.

### 'మాగి గాయత్రి'లో ముగిసిన క్రషింగ్



నిజాంసాగర్: మాగి గాయత్రి కార్మాగారంలో చెరుకు క్రషింగ్ ఆదివారం ముగిసింది. ఈ ఏడాది కార్మాగారంలో రికార్డు స్థాయిలో 4.09 లక్షల టన్నుల చెరుకు క్రషింగ్ చేశామని ఫ్యాక్టరీ కేన్ జనరల్ మేనేజర్ వెంగళ్‌రెడ్డి తెలిపారు. కార్మాగారం పరిధిలోని 15 మండలాల్లో 12,500 ఎకరాల్లో చెరుకు పండించారన్నారు. ఒప్పందం మేరకు చెరుకు టన్నుకు రూ. 3,377 చొప్పున మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో కార్మాగారం వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రావ్, ఇంజినీరింగ్ జీఎం రాజబాబు, డిప్యూటీ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి, ప్రాసెసింగ్ జీఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఐదో విడత నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఆదివారం ఐదో విడత నీటి విడుదల చేపట్టారు. ప్రధాన కాలువకు 1,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు డిప్యూటీ ఈఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. నీరు వృథా కాకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.

### 'పంచాయతీ కార్మికుడిది ప్రభుత్వ హత్యే'

కామారెడ్డి టౌన్: బీబీపేట పంచా యతీ భవనంలో ఆత్మహత్య చేసుకున్న కొంగరి బాబు అనే కార్మికుడిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాకముందు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేసి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు అందకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణభారమై బాబు ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. బాబు కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులందరికీ వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరారు.

### జాతీయ అవార్డుకు సుద్దపల్లి సర్పంచ్ ఎంపిక

- తిరుపతిలో అవార్డు ప్రదానం

డిచ్‌పల్లి: బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) ప్రకటించిన ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డు –2023ను డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి సర్పంచ్ పానుగంటి రూప సతీశ్‌రెడ్డి అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించిన బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా సర్పంచ్ రూప ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బీఎస్‌ఏ ప్రతియేటా ప్రజా ఉద్యమకారుల కు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ పాల్గొన్నారు.

# నంబరు ప్లేట్లపై నజర్!

ట్రాఫిక్ చలానాలు తప్పించుకోవడం కోసం కొందరు వాహనదారులు అడ్డదారులు తొక్కుతున్నారు. వాహనాల నంబర్ ప్లేట్లపై నంబర్లను గుర్తించకుండా ఉండేందుకు రకరకాల వేషాలు వేస్తున్నారు. కొందరు మాస్క్‌తో కవర్ చేస్తుండగా.. ఇంకొందరు నంబర్లు చెరిపేస్తున్నారు. మరికొందరు కొన్ని నంబర్లు చిన్నగా, మరికొన్ని పెద్దవిగా రాయించుకుంటున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. నంబర్ సరిగా లేకపోతే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.



కామారెడ్డిలో నంబరు ప్లేటు సరిగా లేని బైక్ వివరాలను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

- వాహనదారుల అడ్డదారులు
- చలానాలు తప్పించుకునేందుకు ఎత్తులు
- నంబర్లను మార్చి కొందరు, నంబరు లేకుండా మరికొందరు..
- తనిఖీలలో నంబర్ ప్లేట్లను పరిశీలిస్తున్న పోలీసులు
- సక్రమంగా లేకుంటే సీజ్ చేస్తామంటూ హెచ్చరికలు

సాక్షి, కామారెడ్డి: ట్రాఫిక్ ఉల్లంఘనులకు పోలీసులు భారీ ఎత్తున జరిమానాలు విధిస్తుండడంతో కొందరు వాహనదారులు వాటిని తప్పించుకోవడానికి కొత్త ఎత్తులు వేస్తున్నారు. కొందరు బైకు నంబర్లు కనబడకుండా మాస్క్‌తో కప్పేస్తున్నారు. మరికొందరు నంబర్ ప్లేట్‌పై ఏదో ఒక అంకెను తొలగించి తిరుగుతున్నారు. ఇంకొందరు సిరీస్‌ను చెరిపేస్తున్నారు. వాహన నంబరుకు బదులు మరెవరి నంబరునో ఉపయోగిస్తూ చలానాలు తప్పించుకుంటున్నారు. దీనిని గమనించిన పోలీసులు అప్రమత్తమయ్యారు. నంబర్ ప్లేట్ మార్చే వాహనదారులపై పోలీసులు ఇటీవల ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ వాహనాల నంబర్లను పరిశీలిస్తున్నారు. ట్యాబ్‌లో వాహన నంబరును నమోదు చేసి నంబరు అసలుదో, నకిలీదో చెక్ చేస్తున్నారు. అన్ని కాగితాలు సక్రమంగా ఉన్నా సరే, నంబరు ప్లేటుపై నిబంధనల ప్రకారం నిర్ణీత సైజులో నంబరు ఉండాల్సిందేనని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలతో పాటు, అసలే నంబర్లు లేకుండా తిరుగుతున్న వాహనదారులను మందలిస్తున్నారు. వెంటనే నంబరు ప్లేట్లు వేయించుకోవాలని, లేదంటే సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

**తప్పుడు నంబర్ ప్లేట్లతో..**

తప్పుడు నంబరు ప్లేట్లు ఉన్న వాహనదారులు కొందరు పోలీసులకు చిక్కకుండా దొంగదారుల్లో తిరుగుతున్నారు. ఇటీవల జిల్లాలో ఒక వాహనానికి బదులు మరో వాహనానికి చలానాలు జారీ అవుతుండడంతో తప్పుడు నంబర్లతో తిరుగుతున్న వాహనదారులపై పోలీసులు దృష్టి సారించారు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద ప్రతినిత్యం వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు నంబరు ప్లేట్లు సరిగా లేని వారి వాహనాలను ఆపివేసి, నంబరు ప్లేట్లు వేయించుకుని రావాలని, లేదంటే సీజ్ చేస్తామని చెబుతున్నారు. దీంతో నంబరు ప్లేట్లు దెబ్బతిన్నవారు, తొలగించుకున్నవారు సరి చేయించుకుంటున్నారు.



దోమకొండలో వాహనాల తనిఖీ (ఫైల్)

### నిబంధనలివి..

- వాహనదారులు కచ్చితంగా మోటారు వాహన చట్టం నిబంధనలు పాటించాలి. నంబర్ ప్లేట్‌పై రిజిస్ట్రేషన్ నంబర్ తప్ప మరేమీ రాయకూడదు.
- హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ ఉండి విరిగిపోయినా, దెబ్బతిన్నా.. వాటిస్థానంలో కొత్త ప్లేట్ బిగించుకోవాలి.
- మోటారు వాహన చట్టం నిబంధనలకు లోబడి సిరీస్, అంకెలు ఒకే పరిమాణంలో ఉండాలి.
- నంబర్ ప్లేట్‌పై పేర్లు, బొమ్మలు, సందేశాలు ఉండొద్దు.
- ఒక వాహనం నంబర్ ప్లేట్ ఇంకో వాహనానికి వినియోగించడం నేరం.

# నోరు పారేసుకుంటే ఊరుకోం

- అందరం చీము, నెత్తురు ఉన్నవాళ్లమే...
- మా సైన్యం బయటకు వస్తే కార్నర్ మీటింగ్‌లు చేసుకోలేరు
- బీజేపీ నేతలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వార్నింగ్

సాక్షి, కామారెడ్డి: 'మేమూ చీము, నెత్తురు ఉన్నవాళ్లమే. ఓపిక, సహనానికి హద్దు ఉంటుంది. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించేది లేదు. మా సైన్యం బయటకు వస్తే ఒక్క కార్నర్ మీటింగ్ కూడా చేసుకోలేరు. ఇకపై నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదు' అంటూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం కామారెడ్డి ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బజారు రౌడీలాగా మాట్లాడడం తగదన్నారు. రాజకీయాల్లో విమర్శలు విధానపరంగా ఉండాలే కానీ, వ్యక్తిగత దూషణలు, మహిళలను అసభ్య పదజాలంతో దూషించడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి భాష మరోసారి మాట్లాడితే తీవ్ర పరిణామాలుంటాయని, జాగ్రత్తగా ఉండండంటూ బీజేపీ నేతలను హెచ్చరించారు.

ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని స్పీకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ దుశ్చర్యలతో దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని, ఇతర దేశాల ముందు తలవంచుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్పీకర్ పేర్కొన్నారు. అదానీ నుంచే బొగ్గు, కరెంటు కొనాలంటూ అదానీ ఆస్తులు పెరిగేందుకే కేంద్రం పనిచేస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించిన వాళ్లను, ప్రతిపక్షాలను దెబ్బతీయడానికే ప్రయత్నిస్తుంది తప్ప, ప్రజల సమస్యలపై పనిచేయడం లేదన్నారు. ఈడీ, సీబీఐ, ఈసీలను తమ కబంధ హస్తాల్లో పెట్టుకుని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పనిచేస్తున్నారన్నారు. తెలంగాణ జాగృతి ద్వారా కవిత తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారని, అలాంటి కవితను తొమ్మిది గంటల పాటు విచారణ పేరుతో వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ఎంపీపీ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, బీఆర్ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావ్, ప్రభాకర్‌రెడ్డి, మామిండ్ల అంజయ్య, రాజేశ్వర్, నజీర్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

### 15న మంత్రి కేటీఆర్ రాక

నిజాంసాగర్: వాయిదాపడిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జుక్కల్ నియోజకవర్గ పర్యటన ఖరారయ్యింది. ఆయన ఈనెల 15న నిజాంసాగర్, పిట్లం మండలాల్లో పర్యటిస్తారని నిజాంసాగర్ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పర్యటన, బహిరంగ సభలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు విజయవంతం చేయాలని కోరారు.

# గ్రామాల్లో సీసీ రోడ్ల జాతర

- జిల్లాకు రూ. 34.35 కోట్లు కేటాయింపు
- నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం

నాగిరెడ్డిపేట: గ్రామాలలో సీసీ రోడ్ల జాతర సాగుతోంది. జిల్లాలోని ఏ గ్రామంలో చూసినా సీసీ రోడ్ల పనులు సాగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు వేస్తున్నారు. ఈ పథకం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికిగానూ జిల్లాకు రూ. 34.35 కోట్ల నిధులు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో పనులను వేగంగా చేస్తున్నారు. కొన్నిగ్రామాలలో ఇప్పటికే సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల కూడా పనులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో సాగుతున్నారు.



అక్కంపల్లిలో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

# 'కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి'

రాజంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పార్టీ కార్యకర్తలకు సూచించారు. బూత్ సశక్తీకరణ్ అభియాన్‌లో భాగంగా ఆదివారం రాజంపేట మండలం పొందుర్తి గ్రామంలో వన్ డే వన్ బూత్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 31 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి నెల నాలుగో ఆదివారం ప్రధానమంత్రి మోదీ పాల్గొనే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త తప్పకుండా వీక్షించాలని సూచించారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

# తెలంగాణ తల్లి విముక్తి కోసమే..



రైతు సమావేశంలో పాల్గొన్న రైతులు

- హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టాం: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిజాం షుగర్స్ మూతపడేలా చేశారని ఆరోపణ
- తెలంగాణ మోడల్ అంటే వైన్స్, బెల్టుషాపులే అని విమర్శ

మోర్తాడ్/భీమ్‌గల్: వందల మంది త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం, తొమ్మిదేళ్ల నుంచి ఒక వ్యక్తి, కుటుంబం చేతితో బందీ అయ్యిందని, తెలంగాణ తల్లికి బంధ విముక్తి కలిగించేందుకు హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టినట్లు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కమ్మర్‌పల్లి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అలాగే భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణతో పేగు బంధం ఉన్నది కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమేనని, రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియతో ఆంధ్రలో పార్టీ చచ్చిపోతుందని తెలిసినా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఇచ్చిన మాట కోసం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. కానీ ప్రస్తుతం తెలంగాణ రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి ధన దాహానికి రైతులు వ్యవసాయం బంద్ చేసి భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిజాంషుగర్ ఫ్యాక్టరీలను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తే తెలంగాణ ఆవిర్భావం తర్వాత మూతబడేలా చేశారని ఎద్దేవా చేశారు. రైతుబంధు ఇచ్చి రైతులకు రావాల్సిన సబ్సిడీ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా రాకుండా కేసీఆర్ ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. పండుగల సమయంలోనే రైతుబంధు ఇచ్చి బెల్టుషాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మి రాష్ట్ర ఖజానా నింపుకుంటున్నారని విమర్శించారు.



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

**పసుపు రైతులను ఆదుకోవాలి**

జిల్లాలో 35 వేల నుంచి 45 వేల ఎకరాల్లో రైతులు పసుపు పండించేవారని.. గిట్టుబాటు ధర లేక సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకప్పుడు పసుపు ఒక క్వింటాలు అమ్మితే తులం బంగారం వచ్చేదని, ఇప్పుడు మాసం బంగారమైనా వచ్చే పరిస్థితి లేదన్నారు. పసుపు రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. భీమ్‌గల్ మండలానికి కాళేశ్వరం నీళ్లు, గోదావరి జలాలు ఎందుకు రాలేవని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, సీనియర్ నేతలు తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, బాడ్సి చంద్రశేఖర్ గౌడ్, సుంకెట్ రవి, కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, కిక్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పరువు తీస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

జిల్లాలో గతంలో గొప్ప నాయకులు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేసి ఈ ప్రాంత గౌరవాన్ని పెంచారని రేవంత్‌రెడ్డి అన్నారు. అప్పట్లో ఈ జిల్లా నాయకులంటే గౌరవం ఉండేదని, ఇక్కడి ప్రతినిధులు వస్తే శాసన సభలో లేచి నిలబడేవారన్నారు. కానీ ఇప్పుడున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జిల్లా పరువు తీస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక దోపిడీలు చేయడమే పోటీగా మారిందని విమర్శించారు. ఇక్కడి విద్యార్థులు, నిరుద్యోగులు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలు, రైతులతో మాట్లాడి, వారి కష్టాలను తెలుసుకుని రాబోయే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ సమస్యలు ఏ విధంగా పరిష్కరిస్తామో ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

## క్లుప్తంగా

### బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



భిక్కనూరు: పార్టీ బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే గెలుపు సులభం అవుతుందని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో బీజేపీ వన్‌డే వన్ బూత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్‌లో 31 మందితో నూతనంగా కమిటీ ఏర్పాటు చేసి గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు బీజేపీ సిద్ధాంతాలను వివరించాలని చెప్పారు. అలాగే కేంద్రప్రభుత్వం మోదీ నాయకత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలని సూచించారు. వచ్చే ఆసెంబ్లీ ఎన్నికల నాటికి ఇంటింటికి బీజేపీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలియజేయాల్సిన అవశ్యకత ఎంతైన ఉందన్నారు. ప్రతి కార్యకర్త ప్రతిరోజు పార్టీ అభివృద్ధి కోసం ఒక గంట సమయాన్ని కేటాయించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న అవినీతి అక్రమాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ నేతల అవినీతి అక్రమాలపై విచారణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విష్ణు, గణేష్, సిద్దరాములు, నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

### రైస్‌మిల్ వ్యర్థాలపై విచారణ

నవీపేట: మండలంలోని గాంధీనగర్ సమీపంలోని రైస్‌మిల్ నుంచి వెలువడుతున్న వ్యర్థాలపై అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. రైస్‌మిల్ నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పక్కన ఉన్న తమ వ్యవసాయ భూముల్లో వేసిన పంటలె దిగుబడిని ఇవ్వడం లేదని బాధితుడు కిరణ్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు.

### రేషన్ బియ్యం పట్టివేత



మాచారెడ్డి: మండలంలోని భవానీపేట తండా నుంచి బొలేరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి మాచారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. 20 బస్తాల్లో పది క్వింటాళ్ల బియ్యాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండడంతో వెంబడించి పట్టుకున్నట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు రేషన్ బియ్యంతో పాటు బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### మొరం టిప్పర్..

ఎడపల్లి: అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు మండలంలోని ఒడ్డెపల్లి శివారులో శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆర్ఐ ప్రభుదాస్ తనిఖీలు చేపట్టి టిప్పర్‌ను పట్టుకున్నారు. టిప్పర్‌ను పోలీసులకు అప్పగించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మరో మొరం టిప్పర్ ఆపకుండా వెళ్లిన ట్లు సమాచారం. కాగా దొరికిన టిప్పర్ అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడిదని సమాచారం. సదరు నాయకుడు నియోజకవర్గ ప్రతినిధికి అత్యంత సన్నిహితుడు కావడంతో అక్రమ మొరం దందాకు తెరలేపినట్లు తెలిసింది. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా మొరం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అన్నదాత 'వరి'గోస

- పంటను ఆశిస్తున్న తెగుళ్లు
- పురుగు మందు పిచికారితో పెరుగుతున్న పెట్టుబడి
- బోర్లు ఎత్తిపోతుండటంతో ఎండుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

రామారెడ్డి మండలం ఇసన్నపల్లికి చెందిన ముచ్చ పెద్ద గంగయ్య 8 ఎకరాల్లో వరి సాగు చేశాడు. మొదట్లో పంటకు మొగి పురుగు సోకింది. దీంతో నివారణకు మందులను వినియోగించాడు. అయినా రెండు ఎకరాల్లో పూర్తిగా మొగిపురుగు సోకి పంట పెరగలేదు. మరో వైపు బోరుబావులు ఎత్తిపోతుండటంతో నీళ్ల అందక పొలం ఎండిపోతోంది.





ఎండిపోయిన పొలం చూపుతున్న ఇసన్నపల్లికి చెందిన రైతు గణేశ్



పురుగు మందు పిచికారి చేస్తున్న రైతు

నిజాంసాగర్/రామారెడ్డి: యాసంగిలో ఎన్నో ఆశలతో వరి సాగు చేసిన రైతులు అరిగోస పడుతున్నారు. ఓ వైపు తెగుళ్ల ఆశిస్తుండటం.. మరోవైపు బోర్లు ఎత్తిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకోడానికి నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 2.5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో నాటు వేసినప్పటి నుంచే తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. మొన్నటి వరకు మొగి పురుగు ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం పొట్ట దశలో అగ్గి తెగులు ఆశిస్తోంది. దీంతో రైతులు జోరుగా పురుగు మందులను పిచికారి చేస్తున్నారు.

**పెట్టుబడుల భారం**

పొలాలు తెగుళ్ల బారీన పడుతుండటంతో రైతులకు పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. మొగి పురుగు నివారణ కోసం రసాయన మందుల వాడకంతో పాటు పురుగు మందలు పిచికారికి ఎకరానికి రూ.రెండు వేల నుంచి రూ.3,500 వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం అగ్గి తెగులు వ్యాపిస్తుండటంతో మందులను పిచికారి చేస్తున్నారు. దీంతో మళ్లీ పురుగు మందుకు ఎకరానికి రూ.1,500 నుంచి రూ.2,500 వరకు ఖర్చు అవుతుంది. దీంతో పెట్టుబడులు ఎక్కువ అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఎండుతున్న పొలాలు**

ఎండాకాలం ప్రారంభంలోనే జిల్లాలో భూగర్భజలాలు లోతుల్లోకి పోతున్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడటంతో చెరువులు, కుంటలు నిండాయి. యాసంగి ప్రారంభంలో కూడా అవి నీటితో కళకళలాడటంతో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న తరుణంలో చెరువుల్లో నీరు తగ్గుతున్నాయి. భూగర్భ జలాలు సైతం లోతుల్లోకి పోయి బోర్లు వట్టిపోతున్నాయి. దీంతో బోరుబావుల కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు కరెంట్ కోతలు సైతం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**వరి ఎదగలేదు**



మొగిపురుగు, అగ్గి తెగులు సోకడంతో పంట ఎదగలేదు. కరెంట్ సక్రమంగా లేకపోవడంతో పొలాలకు నీరు అందడం లేదు. ఈ సారి దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– గోపాల్, రాజమ్మతండా

**మందులకు బాగా ఖర్చయింది**



పొలానికి మునుపు ఎన్నడూ లేని రోగాలు ఈ యేడు వచ్చాయి. మందులకు బాగా పైసలు ఖర్చు పెట్టినం. లాగోడి బాగా ఖర్చయింది. ఇంకా కోతల ఖర్చు ఉంటది. ఇంత చేస్తే ఏం పైసలు మిగిలేటట్లు కనిపిస్తలే.

– కన్నపురం బక్కయ్య, ఇసన్నపల్లి

# ధ్రువపత్రాలతో కబ్జాలు!

- ఖాళీ, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు పత్రాలు అందిస్తున్న జీపీ కార్యదర్శులు
- వాటిల్లో విస్తీర్ణం నమోదు చేయని వైనం
- కబ్జాలకు అవకాశంగా మార్చుకుంటున్న పలువురు



దోమకొండలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

దోమకొండ: పంచాయతీ కార్యదర్శులు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలే అక్రమార్కుల కబ్జాలకు రాజమార్గంగా మారుతున్నాయి. ఇళ్లు, ఖాళీ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడానికి గ్రామ పంచాయతీ వారు ధ్రువీకరణ పత్రాలను ఇస్తున్నారు. కొన్ని మండలాల్లో ధ్రువీకరణ పత్రాలు ఇస్తుండగా, మరికొన్ని మండలాల్లో వాటికి బదులుగా ఆన్‌లైన్ అసిస్‌మెంట్ కాపీపై పంచాయతీ కార్యదర్శి స్టాంప్, సంతకం వేసి రిజిస్ట్రేషన్ కోసం ఇస్తున్నారు. కాగా వీటిలో ఎక్కడా కూడా సదరు రిజిస్ట్రేషన్ చేసే వ్యక్తికి ఎంత స్థలం ఉంది, దానికి హద్దులు ఎమిటి అనే వివరాలు ఉండటం లేదు. ఖాళీ స్థలాలతో పాటు ఇళ్లకు ఎలాంటి కొలతలు లేకుండా, హద్దులు లేకుండా పంచాయతీ ధ్రువీకరణ పత్రాలు, లేదా ఆన్‌లైన్ అసిస్‌మెంట్ కాపీలు అందిస్తున్నారు. దీనిని అలుసుగా తీసుకుంటున్న కబ్జాదారులు తమకు ఉన్న స్థలం కంటే ఎక్కువగా ఉన్నట్లు చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలు వీరి పక్కన ఉంటే అంతే సంగతి. వాటిని కబ్జా చేసి దర్జాగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. వీరికి పొరుగున ఉన్న వారు ఏదైనా హద్దులు లేదా స్థలాల గొడవల సందర్భంలో రిజిస్ట్రేషన్ ఎక్కువగా చేసుకున్న విషయాలు బయటపడుతున్నాయి.

**దోమకొండ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో..**

దోమకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఐదు మండలాలు, 61 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి ఇళ్లు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్ కోసం పంచాయతీ కార్యాలయం వారు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయాలకు వస్తున్నారు. వీటిపై ఎలాంటి విస్తీర్ణం నమోదు చేయకపోవడంతో అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. కాగా ఇటీవల దోమకొండ సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన సతీష్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు ఈ విషయంలో నోటీసులను పంపించారు. ప్రతి ధ్రువీకరణ పత్రంపై విస్తీర్ణం, మ్యాప్‌తో వివరాలు వేయాలని నోటీసులు పేర్కొన్నారు. కాగా భిక్కనూరు, రాజంపేట మండలాల్లో ధ్రువీకరణ పత్రాలకు బదులు కేవలం ఆన్‌లైన్ అసెస్‌మెంట్ కాపీ మీద పంచాయతీ కార్యదర్శి సంతకం, స్టాంప్ వేసి ఇస్తున్నారు. దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి మండలాల్లో కొందరు పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వగా, మరికొందరు ఆన్‌లైన్ కాపీని రిజిస్ట్రేషన్ కోసం విక్రయదారులకు ఇస్తున్నారు.

**విస్తీర్ణం నమోదు చేయాలి**



ఇళ్లు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్ కోసం ధ్రువీకరణ ప త్రాలు ఇచ్చినప్పుడు ఖచ్చితంగా వాటిపై దాని విస్తీ ర్ణం ఎంత ఉందో నమోదు చేయాలి. పంచాయతీ కార్యాలయాల్లోని రివిజన్ బుక్ ఆధారంగా దీనిని నమోదు చేసి వారికి ఇవ్వాలి. లేదంటే స్థలాలు కబ్జాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ విషయంలో మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి వివరించాం.

– చిన్నారెడ్డి, ఎంపీడీవో, దోమకొండ

**నోటీసులు పంపించాను**



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఈ విషయంలో నోటీసులు పంపించాను. ప్రతి ధ్రువీకరణ పత్రం, లేదా ఆన్‌లైన్ అసిస్‌మెంట్ కాపీ మీద వాటి విస్తీర్ణం వేయాలని నోటిసులో కోరాము. దానికి చాలామంది నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. విస్తీర్ణం నమోదు చేయడం చేస్తే అక్రమాలు జరిగే అవకాశం ఉండదు.

– సతీష్‌కుమార్, సబ్‌రిజిస్ట్రార్, దోమకొండ

# హిందూ ధర్మాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

కామారెడ్డి టౌన్: హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత సంఘటన మంత్రి ముదుపు యాదిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో కామారెడ్డి, ఇందూర్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వీహెచ్‌పీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ కమిటీలు వేయాలన్నారు. గుడి కేంద్రంగా హనుమాన్ చాలీసా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వచ్చే హనుమాన్ జయంతిలో భాగంగా ప్రతి గ్రామంలో వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలన్నారు. విశ్వహిందూ పరిషత్ ప్రాంత సహ సత్సంగ ప్రముఖ్ రాంరెడ్డి, ప్రాంత ఉపాధ్యక్షుడు ఈట రామ్ సింగ్, విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ, గంగారెడ్డి, బొల్లిరాజు, ఏనుగు రాజు, నాయకులు రాజు, వినోద్, అనిల్, బాలాజీ పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

# చికిత్స పొందుతూ యువకుడి మృతి



సత్యబోయిన శివకుమార్(ఫైల్)

నాగిరెడ్డిపేట: గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామానికి చెందిన సత్యబోయిన శివకుమార్(31) ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శివకుమార్ కూలీ పనుల కోసం ఈ నెల 3న ఎల్లారెడ్డికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మండలంలోని మల్తుమ్మెద శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ శివకుమార్‌ను చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శివకుమార్ ఆదివారం తుదిశ్వాస విడిచాడు. మృతుడికి భార్య సమతతోపాటు కూతుర్లు ఇందుప్రియ, వర్షిణి ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

**పెద్దవాల్గోట్‌కు చెందిన వృద్ధురాలు..**



నర్సవ్వ (ఫైల్)

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన నారబోయిన నర్సుబాయి(70) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. నర్సుబాయి శనివారం రాత్రి అన్నం గిన్నెను చీర కొంగుతో స్టవ్ మీద నుంచి దించుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108లో వృద్ధురాలిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు పెద్ద నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### గుండెపోటుతో ఒకరి మృతి



మల్లయ్య(ఫైల్)

రామారెడ్డి: మండలంలోని ఇసన్నపల్లిలో ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వీరబోయిన మల్లయ్య(50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తాడు. శనివారం రాత్రి 7 గంటల వరకు పొలంలో కోతులను తరిమి ఇంటికి వచ్చి అన్నం తిని పడుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఛాతిలో నొస్తుందని చెప్పడంతో భార్య ఇరుగు పొరుగు వారికి తెలిపి ఆస్పత్రికి తరలించే యత్నం చేసింది. అప్పటికే మల్లయ్య కుప్పకూలిపోయాడు.

**కాలువలో పడి ఒకరు..**

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం శాబ్దిపూర్ శివారులో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి సమీపంలోని ఓ చిన్న కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్సై ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడిని మేస్త్రీ పని చేసే హజ్రత్తయ్య(62)గా గుర్తించారు. మృతుడు ప్రకాశం జిల్లా పామద్రు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాలకృత్యాలు తీసుకోవడానికి వెళ్లి బురదలో చిక్కుకుని మృతి చెందినట్లు నిర్ధారించారు.

### బైక్ పేరుతో సైబర్ మోసం

దోమకొండ: మండలంలోని ముత్యంపేటకు చెందిన బత్తుల శ్రీకాంత్ సైబర్ మోసానికి గురయ్యాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన ప్రకారం.. శ్రీకాంత్ ఈనెల 4న తక్కువ ధరకే కేటీఎం బైక్ పొందవచ్చని ఇన్‌స్టామ్‌లో ప్రకటన చూసి 7976399590 నంబర్‌కు పలు దఫాలుగా డబ్బులు పంపాడు. తర్వాత మోసపోయినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఆత్మీయ సమ్మేళనం



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ హైస్కూల్‌లో 1992–93 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితులంతా కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



భిక్కనూరు: భిక్కనూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2002–03 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశం నిర్వహించుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుత ప్రిన్సిపాల్ నర్సింహరెడ్డి, ఉపాధ్యాయులను సన్మానించారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు రాజేశ్వర్‌రెడ్డి

పెర్కిట్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నిర్వహించిన 37వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల ముగింపు కార్యకరమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో కరీంనగర్, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్, తృతీయ స్థానంలో నల్గొండ జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి రమేష్, జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ గంగామోహన్ చక్రు, కో కన్వీనర్ రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, పీఈటీలు కాశిరెడ్డి, సునీత, రమణ, సురేందర్, చిన్నయ్య, శ్యామ్, సంతోష్ ఠాకూర్, నరేంద్రచారి, నిఖిత, మాధురి, పండిత్ పవన్ పాల్గొన్నారు.

### బైక్ చోరీ చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు పట్టుకున్న నిందితుడు

పిట్లం(జుక్కల్): మండలంలోని గొరారం లో శనివారం అర్ధరాత్రి బైక్ చోరీకి యత్నించిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులు అప్పగించారు. గ్రామానికి చెందిన సత్యయ్య తన బైక్‌ను ఇంటి బయట ఉంచగా గుర్తు తెలియని వ్యక్తి అర్ధ రాత్రి బైక్ హైండిల్ లాక్‌ను పగలగొట్టి తీసుకెళ్తుండగ గ్రామస్తులు పట్టుకున్నారు. అనంతరం బైక్ దొంగను పోలీసులకు అప్పగించారు. దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

# ధర్మారం(బి)లో ఇళ్ల స్థలాల గొడవ



ధర్మారం(బి)లో బైఠాయించిన మహిళలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని చర్చి వెనకాల గల బీసీ కాలనీలో ఇళ్ల స్థలాల గొడవ ఆదివారం రెండో రోజు కొనసాగింది. నీటిపారుదలశాఖ స్థలంలో ఇళ్ల స్థలాల పేరిట కొందరు గ్రామస్తులు శనివారం గుడిసెలు వేయాలని యత్నించగా కాలనీవాసులు అడ్డుకున్నారు. పోలీసులు, నీటిపారుదలశాఖ అధికారులు వచ్చి రెవెన్యూ సర్వే పూర్తి చేసిన తర్వాత లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. అప్పటి వరకు ఈ స్థలం వద్దకు రావద్దని స్పష్టం చేసి వెళ్లారు. అయితే గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు ఇక్కడి నుంచి కదలద్దని పేద ప్రజలను రెచ్చగొడుతూ గొడవలు జరిగేలా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఇక్కడికి వచ్చిన వారికే ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తారని చెప్పడంతో ఆదివారం కొందరు మహిళలు స్థలం వద్ద సీసీ రోడ్డుపై టెంట్ వేసి బైఠాయించారు. కాలనీకి చెందిన దివ్యాంగ యువకుడు రోడ్డుకు అడ్డంగా టెంట్ వేస్తే మేం ఇంటికి ఎలా వెళ్లాలని, పక్కకు జరగాలని కోరగా అతడిపై మూకుమ్మడిగా దాడిచేశారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు దెబ్బలు తిన్న యువకుడిపైనే పోలీస్‌లకు ఫిర్యాదు చేయించడం విమర్శలకు తావిస్తోంది.